# సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 24 । ఫిబ్రవరి । 2024




**వన దేవతలకు మొక్కులు**

చిన్నమేడారం, చల్లూరు యాదాద్రి మేడారంలో కొలువుదీరిన వనదేవతలకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. - 8లో



**మహిళా రైతు ఆత్మహత్యాయత్నం**

గుండాల తహసీల్దార్ కార్యాలయం వద్ద మహిళా రైతు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. - 8లో



**బయోమైనింగ్ ఎప్పుడో!**

మోత్కూరు మున్సిపాలిటీలోని డంపింగ్ యార్డులో బయోమైనింగ్‌ను వినియోగంలోకి తేవడం లేదు. - 9లో

## న్యూస్‌రీల్

### 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా

భువనగిరిటౌన్ : కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా రైతులు నిర్వహిస్తున్న ఆందోళనకు మద్దతుగా ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల డిమాండ్లు నెరవేర్చకుండా మోదీ సర్కార్ కక్ష పూరిత వైఖరి అవలంభిస్తుందన్నారు. కేంద్ర వైఖరికి నిరసనగా చేపట్టే ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### గడికోటను సందర్శించిన అదనపు కలెక్టర్



రాజాపేటలోని గడికోట వద్ద అదనపు కలెక్టర్

రాజాపేట : మండ కేంద్రంలోని గడికోటను శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి సందర్శించారు. కోట వివరాల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. అంతకుముందు చిన్నమేడారం గ్రామాన్ని సందర్శించి సమ్మక్క–సారలమ్మ జాతరలో ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వన దేవతలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆయన వెంట తహసీల్దార్ దామోదర్, ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ దినకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఒత్తిడిని జయిస్తేనే విజయం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

రామన్నపేట : పదవ తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివి, ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని డీఈఓ నారాయణరెడ్డి సూచించారు. పదవ తరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో శుక్రవారం రామన్నపేట మండలంలోని మునిపంపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కష్టమైన సబ్జెక్టులను ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పరీక్షల సమయంలో ప్రతి నిమిషం ఎంతో విలువైనదని, సెల్‌ఫోన్లు, టీవీల జోలికి వెళ్లి సమయాన్ని వృథా చేసుకోవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి అశ్వినికుమార్, ప్రధానోపాధ్యాయుడు రహ్మత్‌ఖాన్ హెచ్‌ఈఓ గోపాలు, సూపర్‌వైజర్లు వాణిశ్రీ, మల్లేశం, ఏఎన్‌ఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.

### 28న పాఠశాలల్లో సైన్స్ డే నిర్వహించాలి

భువనగిరి : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని డీఈఓ నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్‌కు సంబంధించి వ్యాసరచన, క్విజ్, సెమినార్, చిత్రలేఖనం, పుస్తక ప్రదర్శన, పరికరాల ప్రదర్శన, ప్రయోగ ఎగ్జిబిట్లు, ప్రాజెక్టులు, శాస్త్రవేత్తలపై ఉపన్యాస పోటీలు, విజ్ఞాన మేళాలు నిర్వహించాలని సూచించారు. గెలుపొందిన విద్యార్థులకు విద్యా కమిటీలు, స్థానికుల సహకారంతో ప్రోత్సాహకాలు అందజేయాలని కోరారు.

### యాదాద్రిలో ఊంజలి సేవ



అమ్మవారి సేవను ఆలయ తిరువీధిలో ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఊంజలి సేవ కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. అమ్మవారిక సేవకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారి సేవను అధిష్టించి ఊంజలి సేవ నిర్వహించారు. అలాగే ప్రధానాలయంలో సుప్రభాత సేవ, అభిషేకం, అర్చనలు, సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం తదితర కైంకర్యాలు గావించారు.



ఎండిన పొలాన్ని చూపుతున్న ఈ మహిళా రైతు పేరు వాంకుదోతు లలిత, ఈమెది తుర్కపల్లి మండలం దయ్యంబండ తండా. గోదావరి జలాల రాకతో గత వేసవిలో చుట్టుపక్కల చెరువుల నిండా నీళ్లున్నాయి. ఈసారి కూడా వస్తాయన్న ఉద్దేశంతో ఐదు ఎకరాల్లో వరి వేసింది. నీళ్ల రాక చెరువులన్నీ ఎండిపోయాయి. బోర్లు కూడా అడుగంటాయి. నీరందక ఇప్పటికే మూడు ఎకరాల పంట ఎండిందని, మల్లన్నసాగర్ నీళ్ల వదలాలని ప్రభుత్వాన్ని కోరుతుంది.



ఈ రైతు పేరు జంగారెడ్డి. ఇతనిది భువనగిరి మండలంలోని గౌస్‌నగర్. ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా యాసంగి సీజన్‌లో రెండు ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఇప్పటి వరకు రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టాడు. జనవరి నుంచి వ్యవసాయ బావి, బోరులో నీరు తగ్గిపోయింది. నీరందక పొలంలో నెర్రెలువారడంతో గేదెలను మేపుతున్నాడు.

# అన్నదాత వరిగోస

**నీరు లేక ఎండుతున్న పొలాలు**

- వర్షాభావంతో పడిపోయిన భూగర్భ జలాలు
- ఎండలకు వట్టిపోతున్న బోర్లు, బావులు
- విద్యుత్ సరఫరాలోనూ అంతరాయం
- వాడుపట్టిన చేలను పశువుల మేతకు వదులుతున్న రైతులు



ఈ ఫొటోలోని మహిళా రైతు అడ్డగూడూరుకు చెందిన తుప్పతి రేణుక. ఈమె బోర్ల ఆధారంగా ఎకరం 10 గుంటలు వరి సాగు చేసింది. భూగర్భ జలాలు అడుగంటి రెండు బోర్లు సరిగా పోయక అరెకం పొలం ఎండిపోయింది. ఇప్పటికే రూ.40 వేలు పెట్టుబడి పెట్టింది. మిగతా పంటను కాపాడుకోవడానికి వరుస తడులు అందిస్తోంది. ఎండలు ముదిరితే ఉన్న పొలం కూడా చేతికొస్తుందో లేదోనని ఆందోళన చెందుతోంది.

సాక్షి, యాదాద్రి : యాసంగిలో ఎన్నో ఆశలు పెట్టుకొని వరి సాగు చేసిన రైతులు అరిగోస పడుతున్నారు. తగిన వర్షాలు కురువక భూగర్భ జలాలు అడుగంటి, మరోవైపు అధిక ఉష్ణోగ్రతలతో పొలాలు బీటలువారుతున్నాయి. ఎండిపోతున్న పంటను కాపాడుకోవడానికి కొందరు వేల రూపాయలు వెచ్చించి ట్యాంకర్ల ద్వారా, పైపులైన్లు వేసి నీటిని అందిస్తుండగా, ఆర్థికస్థోమత లేని రైతులు పశువుల మేతకోసం వదిలేస్తున్నారు.

**నాన్ ఆయకట్టులో ప్రమాదఘంటికలు**

ఐదారేళ్ల తరువాత మళ్లీ సాగునీటి కష్టాలు వచ్చాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సరిగా కురువకపోవడం, గోదావరి జలాలను కూడా వదలకపోవడంతో చెరువులు, కుంటలు అడుగంటాయి. గత ఏడాది ఇదే సమయంలో జిల్లాలో సరాసరి 4.97 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా ఈసారి 7.45 మీటర్ల లోతుకు పడిపోయాయి. జిల్లాలోనే ఆత్మకూర్(ఎం) మండలంలో అత్యధికంగా 12.68 మీటర్ల లోతుల్లో నీటి మట్టాలున్నాయి. ఆ తరువాత సంస్థాన్ నారాయణపురం, తుర్కపల్లి, బొమ్మలరామారం మండలాల్లో ప్రమాదకరస్థాయికి భూగర్భ జలాలు పడిపోయాయి.

**ఆగి పోస్తున్న బోర్లు**

భూగర్భ జలాలు పడిపోవడంతో నాన్ ఆయకట్టు ప్రాంతాలైన ఆత్మకూర్(ఎం), సంస్థాన్‌నారాయణపురం, తుర్కపల్లి, బొమ్మలరామారం, గుండాల, ఆలేరు, మోటకొండూరు, యాదగిరిగుట్ట మండలాల్లో వ్యవసాయ బోర్లు ఆగిపోస్తున్నాయి. రామన్నపేట, అడ్డగూడూరు, భువనగిరి, బీబీనగర్ వంటి ఆయకట్టు ప్రాంతాల్లోనూ పలు చోట్ల బోర్లలో నీరు అడుగంటింది.



భువనగిరి మండలం గౌస్‌నగర్‌లో వట్టిపోయిన వ్యవసాయ బావి



అడ్డగూడూరులో సన్నగా పోస్తున్న బోరు

**పెద్ద ఎత్తున కొత్త బోర్లు**

పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. కొందరు ట్యాంకర్ల ద్వారా, పైపులైన్‌లు వేసి పొలాలకు నీటిని అందిస్తున్నారు. మరికొందరు నూతన బోర్లు వేస్తున్నారు. తుర్కపల్లి మండలంలోని దయ్యంబండతండా, కోనాపూర్, ఇబ్రహీంపూర్, తుర్కపల్లి, మల్కాపురం, వాసాలమర్రి, వీరారెడ్డిపల్లి, గంధమల్ల, పెద్దతండా, ముల్కలపల్లిలో రైతులు ఇప్పటికే పెద్ద ఎత్తున బోర్లు వేశారు.

**చెరువులు వెలవెల**

జిల్లా వ్యాప్తంగా చాలా చెరువులు అడుగంటుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు సరిగా కురువకపోవడంతో చెరువుల్లోకి నీరు చేరలేదు. దీనికి తోడు ఎండలు కూడా ముదరడంతో చెరువులు వట్టిపోతున్నాయి. జిల్లాలో మొత్తం 799 చెరువులు ఉన్నాయి. ఇందులో 167 చెరువుల్లో 25 శాతంలోపు, 160 చెరువుల్లో 50 శాతం లోపు నీరుంది.

**కరెంట్ ట్రిప్ అవుతుంది**



మేము ఇద్దరు అన్నదమ్ములం కలిసి యాసంగి సీజన్‌లో ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాం. ఈ సంవత్సరం సరైన వర్షాలు కురువలేదు. గోదావరి జలాలు కూడా రాకపోవడంతో బావుల్లో ఊటలు తగ్గాయి. దీనికి తోడు ఇటీవల కరెంట్ తరచూ ట్రిప్ అవుతుండడంతో పొలం సరిగా తడవడం లేదు. పట్టిన మడే పడుతుంది. రూ.80 వేలు ఖర్చు చేసి బోరు కూడా వేశాను. అయినా పొలానికి పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. నవాబుపేట రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలతో చెరువు నింపితే బావులు, బోర్లలోకి నీరు వస్తుంది.

– అట్ల ఎల్లారెడ్డి, మాసాన్‌పల్లి, గుండాల

**విద్యుత్ సరఫరాలో అంతరాయం**

వ్యవసాయానికి ఇస్తున్న నిరంతర విద్యుత్‌లో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. రాత్రి 10 గంటల తరువాత సరఫరా నిలిపివేసి ఉదయం 5 గంటలకు తిరిగి ఇస్తున్నారు. అది కూడా మధ్యలో నాలుగైదు సార్లు నిలిపివేస్తున్నారు. కొన్ని మండలాల్లో రాత్రి 11గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు, మరికొన్ని చోట్ల సాయంత్రం 5 నుంచి రాత్రి 11గంటల వరకు వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న రైతులు చెబుతున్నారు. పగటి పూట ఇచ్చే కరెంట్ కూడా మూడు, నాలుగు సార్లు ట్రిప్ అవుతుందని, దీంతో పొలాలకు నీరు పట్టకపోవడమే కాకుండా మోటార్లు కాలిపోయే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

# ఓటు నమోదుకు మరో చాన్స్

- ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- పోలింగ్ శాతం పెంపునకు కసరత్తు
- కళాశాలల్లో యువతకు అవగాహన కార్యక్రమాలు




భువనగిరి : పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టింది.అందులో భాగంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని నిర్ణయించింది.

ఈనెల 8న ప్రకటించిన జాబితా ప్రకారం ఓటర్లు

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ట్రాన్స్‌జెండర్లు | మొత్తం |
|---|---|---|---|---|
| భువనగిరి | 1,08,598 | 1,11,358 | 01 | 2,19,957 |
| ఆలేరు | 1,16,344 | 1,17, 497 | 19 | 2,33,860 |
| మొత్తం | 2,24,942 | 2,28,855 | 20 | 4,53,817 |

ఓటు నమోదుకు మరో అవకాశం కల్పిస్తూ షెడ్యూల్ ప్రకటించింది. ఏప్రిల్ 1నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.దీంతో పాటు చేర్పులు, మార్పులు, పేర్ల తొలగింపునకు అవకాశం కల్పించింది. తహసీల్దార్ కార్యాలయాల్లో నేరుగా, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకవాల్సి ఉంటుంది.

**ఇప్పటికే రెండుసార్లు అవకాశం**

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే రెండుసార్లు ఓటు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈ నెల 8న తుది జాబితా కూడా విడుదల చేసింది. తాజాగా మరోసారి అవకాశం ఇచ్చింది. కళాశాలల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో అక్కడిక్కక్కడే ఓటరుగా నమోదు చేయనున్నారు. కాగా ఈనెల 8న విడుదల చేసిన తుది జాబితాకు అనుబంధంగా మరో జాబితా విడుదల చేయనున్నారు.

**అవగాహన కార్యక్రమాలు**

లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంపునకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందు కోసం డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. ఇప్పటికే కలెక్టరేట్, ఆర్డీఓ ఆఫీస్ వద్ద ఈవీఎంలు ఏర్పాటు చేసి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.

# కుర్చీ కోసం కాంగ్రెస్ వ్యూహం!

- మున్సిపాలిటీలో మెజార్టీ సాధించేందుకు ప్రయత్నాలు
- ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్
- నేడో, రేపో ఓటరుగా నమోదు




భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపల్ రాజకీయం ఉత్కంఠను రేపుతోంది. ఎట్టి పరిస్థితిలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉన్న కాంగ్రెస్.. ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోవడం లేదు. కౌన్సిల్‌లో కాంగ్రెస్‌కు 11 మంది సభ్యులు ఉండగా ఇతర పార్టీల నుంచి వచ్చి చేరిన వారు, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యేతో కలుపుకొని వారి సంఖ్యా బలం 15కు చేరింది. మెజార్టీ కోసం ప్రయత్నిస్తున్న ఆ పార్టీ నేతలు.. ఎమ్మెల్సీగా ఎన్నికైన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఓటు నమోదు చేసుకోవాలని కోరినట్లు సమాచారం. శనివారం లేదా సోమవారం ఓటు నమోదు చేసుకోనున్నట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి స్థానంలో ఆయన ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉంది.

**కొనసాగుతున్న క్యాంపులు**

ఈనెల 28న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తమ కౌన్సిలర్లు చేజారిపోకుండా జాగ్రత్త పడుతున్నాయి. ఇప్పటికే ఇరు పార్టీలు క్యాంపులు నెరపుతున్నాయి. కాంగ్రెస్ సభ్యులు గోవా క్యాంపులో ఉన్నట్లు సమాచారం. ఇరు పార్టీల సభ్యులు 28వ తేదీన నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**నేడు కౌన్సిలర్లకు నోటీసులు**

28న జరిగే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు హాజరు కావాలని శనివారం కౌన్సిలర్లకు నోటీసులు అందజేయనున్నారు.

# సైబర్ సెక్యూరిటీపై అవగాహన



మాట్లాడుతున్న ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా

బీబీనగర్ : బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో ఐటీ సెల్ ఈ–డిజిటల్ వర్క్ స్పేస్ భద్రత కోసం శుక్రవారం సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా సైబర్ సెక్యూరిటీ పటిష్టంగా లేకపోతే సైబర్ నేరగాళ్ల నుంచి బెదిరింపులు, ఇతర మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఆరోగ్య సంరక్షణ, ఐటీ నిపుణుల కోసం మెడికల్ డొమైన్‌లో డిజిటల్ వర్క్‌స్పేస్‌ను భద్రపరచడానికి, ఆలోచనలు, వ్యూహాల మార్పిడికి కీలక వ్యక్తులతో వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబర్ సెక్యూరిటీపై వైద్యసిబ్బందితో పాటు మెడికల్, నర్సింగ్ విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ వైద్యులు అభిషేక్ అరోరా, అశోక్ నితిన్‌జాన్, వర్గీస్, గాయత్రి, సైంటిస్ట్ సీతామహాలక్ష్మి, అధ్యాపకులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

### అర్హులందరికీ ఉపాధి పని కల్పించాలి

ఆత్మకూరు(ఎం) : ఉపాధిహామీ పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ సురేష్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో ఉపాధిహామీ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామ అభివృద్ధికి ఉపయోగపడే పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఎక్కువ పనులను గుర్తించి అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని సూచించారు. కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ఎండీ నిరంజన్, ఏపీఓ రమేష్ ఉన్నారు.

### రథోత్సవం.. రమణీయం



యాదాద్రి పూర్వగిరీశుడి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన రథోత్సవంలో రథాన్ని లాగుతున్న ఆలయ అధికారులు, రథంపై ఆశీనులైన ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

### ● అప్పుడు సేఫ్..



ఈ నెల 13న నల్లగొండలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభ వేదికపై కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత (రెడ్ శారీ)



సభకు హాజరై తిరిగి వెళ్తుండగా చర్లపల్లి వద్ద లాస్యనందిత కారు ప్రమాదానికి గురికాగా.. ఆమెకు ఏమీ కాలేదు. ముందు భాగం దెబ్బతిన్న కారు నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద ఉంది

# 30 కేంద్రాలు.. 12,559 మంది విద్యార్థులు

- 28 నుంచి ఇంటర్ పరీక్షలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

భువనగిరి : ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో రాజాపేట, మోత్కూర్, యాదగిరిగుట్టలో సెల్ఫ్ సెంటర్లు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో 12,559 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ప్రథమ సంవత్సరం 6,109, సెకండియర్ విద్యార్థులు 6,450 మంది ఉన్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. జనరల్ పరీక్షలు మార్చి 14వరకు, ఒకేషనల్ 16 వరకు కొనసాగనున్నాయి.

**పర్యవేక్షణకు సిబ్బంది**

పరీక్షల పర్యవేక్షణకు 30 మంది సూపరింటెండెంట్లు, 30 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, సుమారు 400 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. వీరితో పాటు ముగ్గురు సభ్యులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, 30 మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నారు. ఇప్పటికే వీరందరికీ శిక్షణ ఇచ్చారు. అలాగే ముగ్గురు సభ్యులతో కూడిన డీఈసీ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి డీఐఈఓ రమణి కన్వీనర్‌గా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 11 స్టోరేజీ పాయింట్లలో ప్రశ్నపత్రాలను భద్రపరిచారు.

**నిమిషం నిబంధన**

ఎప్పటిమాదిరిగానే ఇంటర్ పరీక్షలకు నిమిషం నిబంధన ఉంది. అలాగే పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించనున్నారు. పరీక్ష సమయంలో కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఇప్పటికే నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేశారు.

## క్లుప్తంగా

### ఎంజీయూ కామర్స్ ప్రిన్సిపాల్‌గా ఎంవీఎన్ రెడ్డి

నల్లగొండ రూరల్: మహాత్మా గాంధీ యూనివర్సిటీ కామర్స్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎంవీఎన్ రెడ్డిని నియమిస్తూ రిజిస్ట్రార్ అల్వాల రవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సహచర అధ్యాపకులు ఎంవీఎన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

### వంట గ్యాస్ సిలిండర్ నుంచి నీరు


సిలిండర్‌లో నుంచి వస్తున్న నీరు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామంలో వంట గ్యాస్ సిలిండర్ నుంచి నీరు వచ్చింది. గ్రామానికి చెందిన కూరాకుల లక్ష్మి శుక్రవారం వంట చేస్తుండగా.. కొంతమేరకు గ్యాస్ వచ్చి మంట ఆగిపోయింది. ఆ సిలిండర్‌ను పరిశీలించగా అందులో నుంచి నీరు రావడం గమనించింది. సరఫరా చేస్తున్న గ్యాస్ సిలిండర్ తూకం తక్కువ రావడంతోపాటు, సిలిండర్‌లో నీరు కలిసి వస్తుందని ఆరోపించింది. సంబంధిత గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతోంది.

# వనదేవతలకు మొక్కులు


రాజాపేట : చిన్నమేడారం జాతరకు హాజరైన భక్తులు

- వైభవంగా కొనసాగుతున్న చిన్న మేడారం ఉత్సవాలు

రాజాపేట: మండలంలోని చిన్నమేడారం, చల్లూరు యాదాద్రి మేడారాల్లో కొలువుదీరిన వనదేవతలకు శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లమ్మ బోనాలతో ప్రారభమైన సమ్మక్క సారలమ్మ జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా పరిసర వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అమ్మవార్లకు వడిబియ్యాలు, గాజులు, పసుపు, కుంకుమ, వస్త్రాలు, తలనీలాలు సమర్పించుకున్నారు. నిలువెత్తు బంగారం (బెల్లం) తూకంవేసి అమ్మవారికి నైవేద్యంగా అర్పించారు. గద్దెల చుట్టూ ప్రదక్షిణలు చేసి వరం పట్టి ముడుపులు చెల్లించుకున్నారు. కాగా.. శనివారం సమ్మక్క–సారలమ్మ దేవతల వన ప్రవేశం నిర్వహించడంతో జాతర ముగియనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

### గద్దెకు చేరిన పగిడిద్దరాజు

పెద్దవూర: మండలంలోని పొట్టిచెల్మ ఎక్స్‌రోడ్డు వద్ద కృష్ణా నది సమీపంలో చిన్న మేడారం వద్ద సమ్మక్క–సారలమ్మ జాతర మూడోరోజు కొనసాగింది. శుక్రవారం వేకువజామున ప్రధాన పూజారులు డప్పు వాయిద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి పగిడిద్దరాజును గద్దెకు చేర్చారు. సమీప గ్రామాల ప్రజలు వనదేవతలను దర్శించుకుని నిలువెత్తు బంగారం సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారులు, ధర్మకర్తలు గుంజ అంజమ్మ, గుంజ కృష్ణంరాజు, నాగపురి లక్ష్మి పాల్గొన్నారు.


వన దేవతలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కోలాటం వేస్తున్న మహిళలు

### పోటెత్తిన భక్తజనం

పెన్‌పహాడ్: మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామంలో శ్రీసమక్క–సారలమ్మ జాతర శుక్రవారం మూడో రోజు వైభవంగా కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తమ మొక్కలు చెల్లించుకున్నారు. అమ్మవారికి బంగారం (బెల్లం) సమర్పించారు. నాగుపాము పుట్ట వద్ద భక్తులు పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ నాతాల వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ బండి ధనమ్మరామకృష్ణారెడ్డి, బండి మధుసూదన్‌రెడ్డి, మామిడి వెంకన్న, వాంకుడోతు జ్యోతి, కుందూరు ప్రభాకర్‌రెడ్డి, బెల్లంకొండ శ్రీరాములు, కుందూరు వెంకట్‌రెడ్డి, దొంతగాని గోపయ్య, బచ్చలకూరి రామచంద్రు, మందాది పాపయ్య, భేగం జాన్‌షా, బచ్చలకూరి జానయ్య దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కాగా.. ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి కోలాటం, డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ పోటీలు కొనసాగుతున్నాయి.

# దివ్యవిమాన రథంపై నారసింహుడు


గరుడ వాహనసేవను ఊరేగిస్తున్న ఆలయ అర్చకులు, పాల్గొన్న ఈఓ రామకృష్ణారావు, అధికారులు

- పూర్వగిరిలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు
- గరుడ వాహనంపై ఊరేగిన శ్రీస్వామి వారు

యాదగిరిగుట్ట: శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం శ్రీస్వామి వారు గరుడ వాహనంపై ఊరేగారు. రాత్రి దివ్యవిమాన రథంపై తిరువీధుల్లో విహరించారు. ఆలయంలో నిత్య ఆరాధనల అనంతరం ఆలయ ప్రధానార్చకులు, యాజ్ఞాచార్యులు, అర్చక బృందం, వేదపండితులు, పారాయణీకులు చతుర్వేద పారాయణములు, నిత్య హవనం, మూలమంత్ర, మూర్తి మంత్ర జపములు, లక్ష్మీ అష్టోత్తర నామ జపములు నిర్వహించారు. కల్యాణ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి, గరుడ వాహన సేవలో తిరువీధిలో ఊరేగించారు. ఇక సాయంత్రం రథాంగ హోమం, రథబలి వేడుకలను ఆగమ శాస్త్రానుసారంగా జరిపించారు. రథంపై శ్రీస్వామి అమ్మవార్లను అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం జరిగిన వేడుకల్లో ఈఓ రామకృష్ణరావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ప్రధానార్చకులు, అర్చక బృందం పాల్గొన్నారు.


గరుడ వాహనంపై శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణ మూర్తులు

**పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవంలో యువత, భక్తులు అధికంగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో పాతగుట్టతో పాటు యాదగిరిగుట్ట మండలంలోని చుట్టుపక్కల ఉన్న యువకులు, మహిళలు, యువతులు, భక్తులు పాల్గొని నృత్యాలు చేస్తుండగా శ్రీస్వామి అమ్మవార్లు ఉన్న రథం ముందుకు సాగింది. రథోత్సవం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

**సాంస్కృతిక కార్యక్రమాలు..**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మల్లాపురానికి చెందిన శ్రీరామభక్త భజన మండలి, యాదగిరిగుట్టకు చెందిన శ్రీగాయత్రి మహిళ భజన మండలిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఇక హైదరాబాద్‌కు చెందిన డీఎస్ శ్రీదేవి భక్తి సంగీతం నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక విశ్వకళా మండలి రాంపల్లి వారిచే నృత్య ప్రదర్శన జరిగింది.

**నేడు చక్రతీర్థం**

వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఆలయంలో ఉదయం 9గంటలకు పూర్ణాహుతి, మధ్యాహ్నం 12గంటలకు చక్రతీర్థం, సాయంత్రం 5గంటలకు దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, డోలారోహణం నిర్వహించనున్నారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



# దారితప్పి జనారణ్యంలోకి..

- అర్బన్ పార్కులో ఇటీవల 45జింకలను వదిలిన అధికారులు
- కంచె దాటుకుని బయటకు వస్తుండడంతో వాటిని వేటాడుతున్న వీధి కుక్కలు
- ఇప్పటికే రెండు జింకలు మృతి
- శుక్రవారం ఫైలాన్‌కాలనీలో వీధుల వెంట పరుగులు పెట్టిన మరో జింక


ఇంట్లో దూరిన జింకను పట్టుకుంటున్న యువకులు

నాగార్జునసాగర్: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో భాగమైన నాగార్జునసాగర్ కోర్ ఏరియాలో అడవిలో వదిలిన జింకలు జనారణ్యంలోకి వచ్చి వీధికుక్కల బారిన పడుతున్నాయి. సాగర్ తీరంలో నాగార్జునసాగర్–హైదరాబాద్ నల్లగొండ రహదారి వెంట ఏర్పాటు చేసిన అర్బన్ పార్కులో ఇటీవల సుమారుగా 45జింకలను వదిలారు. కేవలం రోడ్డు వెంట, పక్కన గల చేల వైపు మాత్రమే ముళ్ల కంచె వేశారు. వెనుక వైపు కేవలం కట్టెలు, కంపతో కంచె ఏర్పాటు చేశారు. దీంతో జింకలు వెనక వైపు నుంచి కంచెను దూకి బయటకు వెళ్తున్నాయి. ఈ నెల 8న, 22న దారితప్పిన జింకలను వీధికుక్కలు వెంటాడి చంపివేశాయి. ఇదిలా ఉండగా.. మరో జింక శుక్రవారం ఉదయం నందికొండ మున్సిపాలిటీలోని ఫైలాన్‌కాలనీలో వీధుల వెంట పరుగులు పెట్టింది. యువకులు దానిని పట్టుకునేందుకు ప్రయత్నించగా.. ఒకరి ఇంట్లో దూరింది. ఫారెస్ట్ అధికారులకు ఫోన్‌చేయడంతో వారు వచ్చి తీసుకువెళ్లారు.

**మిగిలిన జింకలన్నీ పదిలమేనా..**

సుమారుగా 45 జింకలను అడవిలో వదలగా రెండు జింకలు జనారణ్యంలోకి వచ్చి ప్రాణాలు పోగొట్టుకున్నాయి. మిగిలిన జింకలు పదిలంగా ఉన్నట్టా లేదా పక్కనగల గ్రామాల్లోకి వెళ్లినట్టా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. జింకలను కాపాడేందుకు ఫారెస్ట్ అధికారులు గత రెండు రోజులుగా అటవీ ప్రాంతం వెంటగల తండాలు, గ్రామాలకు వెళ్లి ఎక్కడైన జింకలు కనపడితే అటవీ అధికారులకు ఫోన్లు చేయాలని, వాటిని తాము వచ్చేంతవరకు కాపాడాలని మైకులో చెప్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

### ఉరేసుకుని మహిళ బలవన్మరణం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని చైతన్యనగర్‌లో శుక్రవారం మహిళ ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం మంగలదుబ్బతండాకు చెందిన కొర్ర ధనలక్ష్మి(29) గత మూడేళ్లుగా తన భర్త లక్ష్మణ్‌కు దూరంగా ఉంటుంది. పట్టణంలోని చైతన్యగనగర్‌లో గల తన అక్క, బావ విదేశాల్లో ఉంటుండగా వారి పిల్లలను చూసుకుంటూ వారింట్లోనే తన తొమ్మిదేళ్ల కుమారుడితో కలిసి ఉంటుంది. ఈ క్రమంలో శుక్రవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే.. ఆమె మృతికి దామరచర్ల మండలం మొదుగులదండాకు చెందిన మహేష్ అనే వ్యక్తి కారణమని ధనలక్ష్మి తమ్ముడు ధీరావత్ దామోదర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### నిందితుడిపై ఫోక్సో కేసు

వలిగొండ : బాలికను కిడ్నాప్ చేసిన ఘటనలో నిందితుడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడిని శుక్రవారం చౌటుప్పల్ జడ్జి ఎదుట హాజరు పరచగా అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ మహేందర్ లాల్ తెలిపారు. వివరాల ప్రకారం.. మండలంలోని ఆరూరుకు చెందిన బండారు రాజు అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను కిడ్నాప్ చేశాడని బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కిడ్నాప్ కేసులో తప్పించుకుని తిరుగుతున్న నిందితుడు బండారు రాజును జనగాం జిల్లాలోని ఎర్రగొల్లపాడు గ్రామంలో పోలీసులు అరెస్టు చేసి చౌటుప్పల్ కోర్టులో హాజరు పరిచారు. దీంతో జడ్జి ఆదేశాల మేరకు నిందితుడిపై ఫోక్సోచట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

### గంజాయి విక్రయించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

రామగిరి(నల్లగొండ): గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన కేసులో వ్యక్తికి మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు కోర్టు జడ్జి బి.తిరుపతి శుక్రవారం తీర్పు వెలువరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు గోదావరి జిల్లా పెద్దపురానికి చెందిన నందం సురేష్ గంజాయి విక్రయించడం వృత్తిగా ఎంచుకున్నాడు. 2022 ఏప్రిల్ 21న నల్లగొండలోని మిర్యాలగూడ రోడ్డులో ఓ పెట్రోల్ బంకు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. అప్పటి సీఐ వి.వెంకటేశ్వర్‌రెడ్డి సిబ్బందితో కలిసి పెట్రోల్ బంకు వద్ద అనుమానాస్పదంగా ఉన్న సురేష్ అదుపులోకి తీసుకోగా అతని వద్ద 1.9 కిలోల గంజాయి పట్టుపడింది. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని రిమాండ్ చేసి కోర్టుకు తరలించారు. ఎస్సై రోజ చార్జ్‌షీట్ నమోదు చేసి విచారణ చేయగా నల్లగొండ చుట్టు పక్కల ఉన్న యువతను లక్ష్యంగా ఎంచుకుని గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరిగిరి వెంకట్‌రెడ్డి వాదనలతో ఏకీభవించిన మొదటి అదనపు కోర్టు జడ్జి బి.తిరుపతి నిందితుడికి 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.20 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

### యువకుడు ఆత్మహత్య

రామగిరి(నల్లగొండ): అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిప్పర్తిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని గడ్డికొండారం గ్రామానికి చెందిన కన్నరాజు నవీన్(27) తిప్పర్తి మిషన్ భగీరథ పంప్‌హౌస్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మూడు సంవత్సరాల క్రితం కాజీరామారం గ్రామానికి చెందిన శివానితో వివాహమైంది. నవీన్ తనకున్న 5 ఎకరాల భూమితోపాటు మరో ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. అప్పుచేసి పెట్టుబడి పెట్టాడు. ఈసారి బోర్లు సరిగా పోయకపోవడంతో వేసిన పంట అంతా ఎండిపోయింది. దీంతో మనస్తాపం చెందిన నవీన్ శుక్రవారం ఇంటి నుంచి డ్యూటీకి వెళ్లి తిప్పర్తి పంప్‌హౌస్ వద్ద మెట్లకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఆరు నెలల కుమారుడు ఉన్నాడు. అతడి తండ్రి సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

# యూనివర్సిటీలో కరపత్రాల కలకలం

- 'నిరుద్యోగ విద్యార్థి రాడికల్స్' పేరిట కరపత్రాలు

నల్లగొండ రూరల్ (ఎంజీ యూనివర్సిటీ): మహాత్మా గాంధీ యూనివర్సిటీలో శుక్రవారం 'నిరుద్యోగ విద్యార్థి రాడికల్స్' పేరిట వెలిసిన కరపత్రాలు కలకలం రేపాయి. 'అవినీతి సొమ్ముతో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారావని.. యూనివర్సిటీలో చీకటి వ్యాపారానికి తెరలేపావని' యూనివర్సిటీ వీసీని దూషిస్తూ కరపత్రంలో పేర్కొన్నారు. అవినీతి అధికారులంతా తప్పు ఒప్పుకుని విధుల నుంచి వైదొలగాలని హెచ్చరించారు. 31 మంది అవినీతి మార్గంలో ఉద్యోగాలు పొందారని అందులో పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రాణాలకు తెగించి తెలంగాణ కోసం బలైన నిరుద్యోగులు గుర్తుకు రాలేదా.. అని మాజీ మంత్రి పేరును కూడా కరపత్రంలో ప్రస్తావించారు.

**నిరాధారమైన ఆరోపణలు: ఎంజీయూ వీసీ**

కరపత్రాల్లో ఉన్న అంశాలన్నీ పూర్తిగా నిరాధారమైనవని ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. తనకు రియల్ ఎస్టేట్‌లో వ్యాపారాలు లేవని, యూనివర్సిటీలో ఎలాంటి అవినీతి జరగలేదని, సమస్యలు ఉంటే తనను అడగవచ్చని తెలిపారు.

# గ్రామంలో సంచరిస్తున్న మహిళల బైండోవర్

యాదగిరిగుట్ట రూరల్ : గ్రామంలో పలువురు మహిళలు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని బైండోవర్ చేశారు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని దాతర్‌పల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దాతర్‌పల్లి గ్రామంలో ఐదుగురు మహిళలు కండెల జ్యోతి, జగన్నాథం నాగమ్మ, పోలే యశోద, జగన్నాథం జ్యోతి, జగన్నాథం నాగమ్మ కలిసి డబ్బులు వడ్డీలకు ఇస్తామని చెప్పి గ్రామంలో తిరుగుతున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు పిల్లలను ఎత్తుకెళ్లేవారేమోనని అనుమానంతో మండల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ సమాచారంతోవెంటనే పోలీసులు గ్రామానికి చేరుకుని మహిళలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా వారు గజ్వేల్ పట్టణానికి చెందిన వారని తేలింది. తక్కువ డబ్బులను అధిక వడ్డీలకు ఇస్తుంటారని, ఆ క్రమంలోని డబ్బులు వడ్డీలకు ఇవ్వడానికి దాతర్‌పల్లి గ్రామానికి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. వారిని స్థానిక తహసీల్దార్ ఎదుట 109 సీఆర్‌పీసీ కింద బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.


యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయంలో మహిళలను బైండోవర్ చేస్తున్న పోలీసులు

# 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత


నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నార్కట్‌పల్లి: పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ధనలక్ష్మి రైస్ మిల్ ఎదురుగా గల రేకుల షటర్‌లో పీడీఎస్ బియ్యం నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో నార్కట్‌పల్లి పోలీసులు, ప్రత్యేక పోలీసు బృందం అక్కడకు వెళ్లి తనిఖీ చేశారు. ఈసందర్భంగా పట్టణానికి చెందిన దోసపాటి వేణు అక్రమంగా నిల్వ చేసిన సుమారు 22 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించారు. వేణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

# నేడు వజ్రతేజ రైస్‌మిల్లులో చిరంజీవి సినిమా షూటింగ్

హాలియా: ప్రముఖ తెలుగు చలనచిత్ర నటుడు, మెగాస్టార్ చిరంజీవి నటించనున్న విశ్వంబర సినిమా షూటింగ్‌ను శనివారం హాలియా పట్టణంలోని వజ్రతేజ రైస్ మిల్లులో నిర్వహించనున్నారు. ఈమేరకు చిత్ర యూనిట్ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే వారు షూటింగ్‌కు సంబంధించి మిల్లు యాజమాన్యం అనుమతి తీసుకున్నారు. యూవీ క్రియేషన్ బ్యానర్‌పై నిర్మించనున్న ఈ సినిమాలో చిరంజీవి, రాజా రవీంద్ర, హర్షవర్ధన్, వెన్నెల కిశోర్, చమ్మక్ చంద్ర, ప్రవీన్, రోహన్, అకుల్, కుసుం, ప్రత్యూష సింగంశెట్టి, నాగరాజు, రాహుల్‌లపై సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. మిల్లులోని 10 ధాన్యం లోడ్లతో ఉన్న ట్రాక్టర్లు, మిల్లు ఆవరణలో సన్నివేశాలు తీయనున్నట్లు సమాచారం. ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు సినిమా షూటింగ్ నిర్వహించనున్నారు. చిరంజీవి సినిమా షూటింగ్ కావడంతో అభిమానులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, హాలియా సీఐ రాఘవరావు భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు.

# తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళా రైతు ఆత్మహత్యాయత్నం



తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్రోల్ మీద పోసుకొని ఆందోళన చేస్తున్న మహిళా రైతు

గుండాల : వ్యవసాయ భూమి తనకు దక్కకుండా పోతుందని ఆందోళన చెందిన మహిళా రైతు తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్రోల్ మీద పోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం కొమ్మాయిపల్లి గ్రామానికి చెందిన కాటబోయిన వెంకటయ్యకు ముగ్గురు కూతుళ్లు ఉండగా.. వారందరి పెళ్లిళ్లు అయ్యాయి. రెండో కూతురు రామక్క తన భర్తతో కలిసి పెళ్లి అయినప్పటి నుంచి వెంకటయ్య వద్దే ఉంటున్నది. చిన్న కూతురు మరణించగా పెద్ద కూతురు సోమక్క తన భర్తతో గొడవలు జరిగి.. ఆమె కూడా తండ్రి వెంకటయ్య వద్ద ఉంటున్నది. అయితే, వెంకటయ్య పేరు మీద ఉన్న 11 ఎకరాల భూమిని పెద్ద కూతురు సోమక్క తన పేరు మీద పట్టా చేయించుకుంది. ఆ తర్వాత అందులో నుంచి ఏడు ఎకరాల భూమిని చెల్లెలు రామక్క కుమారుడైన సంగి స్వామికి పట్టా చేశారు. మిగతా 4 ఎకరాల భూమిని వెంకటయ్య మూడో కూతరు లక్ష్మమ్మ మనమరాలైన అశ్వినికి ఇచ్చేందుకు ఇటీవల ఒప్పందం కుదిరింది. అశ్విని ఆ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకునేందుకు సిద్ధమైంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు శనివారం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు స్లాట్ బుక్ చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న సంగి స్వామి భార్య సంగి సుమలత (రామక్క కోడలు) ఆ భూమి తమకే కావాలంటూ తన భర్తపై రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం పెట్రోల్ మీద పోసుకొని ఆత్మహత్యా యత్నం చేసుంది. ఇది గమనించిన రెవెన్యూ సిబ్బంది కార్యాలయంలో ఉన్న ఇతర వ్యక్తులు వారిని వారించి పెట్రోల్ డబ్బాను తీసేసుకున్నారు.

**వివరాలు తెలుసుకుని పరిష్కరిస్తాం..**

మహిళా రైతు ఆందోళన మేరకు రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేసినట్లు తహసీల్దార్ జలకుమారి తెలిపారు. గ్రామానికి వెళ్లి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలు తెలుసుకొని పరిష్కరిస్తామని తెలిపారు.

### తాళం వేసిన ఇంట్లో చోరీ


బీరువాలో నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

గుండాల : తాళం వేసిన ఇంట్లో చోరీ చేసి రూ.45వేల నగదుతో పాటు అర్ధతులం (రెండు కమ్మలు) బంగారం గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దాసి సోమయ్య ఈనెల 20న (మంగళవారం) సమ్మక్క సారక్క జాతరకు వెళ్లాడు. దీంతో అతడు శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులకు వేసిన తాళం విరగ్గొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూశాడు. ఇంట్లో ఉన్న బీరువాను తెరిచి డబ్బాలలో దాచుకున్న సుమారు రూ.45వేలతో పాటు అర్ధతులం బంగారు కమ్మలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు వాపోయాడు. బాధితుడు సోమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.